ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 26 నవంబరు 2025



నూతన విత్తన చట్టంపై అవగాహన

మంథనిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూరయ్యపల్లి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నూతన విత్తన చట్టం 2025పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు విషయాలను వివరించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, టిజిఈఆర్‌సి సభ్యులు శశిభూషణ్ కాచే, వ్యవసాయ శాఖ అధికారులు అంజనీమిశ్రా, దాసరి నవ్యలు పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికలకు మోగిన నగారా

డిసెంబరు 11,14,17 తేదీల్లో మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

- జిల్లాలో 263 పంచాయతీలు, 2,432 వార్డు స్థానాలు
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామపంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. వచ్చే నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మంగళ వారం సాయంత్రం షెడ్యూల్ విడుదల చేశారు. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అందులో భాగంగా జిల్లాలో కూడా మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 263 గ్రామపంచాయతీలు, 2432 వార్డు స్థానాలు ఉన్నాయి. సర్పంచ్, వార్డు స్థానాలకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతానికి మించకుండా ఈ నెల 23వ తేదీన రిజర్వేషన్లు ఖరారు చేశారు.

50 శాతం రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు..

ఏడాదిన్నర క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన గ్రామపంచాయతీ ఎన్నికలు, జూన్ జూలైలో జరగాల్సిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, 2025 జనవరిలో నిర్వహించాల్సిన మున్సిపల్ ఎన్నికలను నిర్వహించలేకపోయింది. ప్రత్యేక అధికారుల పాలన తీసుకువచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం 2024 అక్టోబరు, నవంబరు మాసాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టింది. ఈ ఏడాది మార్చి నెలలో కుల గణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. బీసీలకు 42 శాతం

(మిగతా 8వ పేజీలో)

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

విడత	మండలం	పంచాయతీలు	షెడ్యూల్	తేదీ
మొదటి విడత డిసెంబరు 11	కాల్వశ్రీరాంపూర్	24 పంచాయతీలు	నోటిఫికేషన్	నవంబరు 27
	కమాన్‌పూర్	09 పంచాయతీలు	నామినేషన్లు	నవంబరు 27 నుంచి 29
	రామగిరి	16 పంచాయతీలు	నామినేషన్ల పరిశీలన	నవంబరు 30
	ముత్తారం	15 పంచాయతీలు	ఉపసంహరణ గడువు	డిసెంబరు 3
	మంథని	35 పంచాయతీలు	పోలింగ్	డిసెంబరు 11
	మొత్తం 99 పంచాయతీలు, 896 వార్డులు		(సమయం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 వరకు)	
రెండో విడత డిసెంబరు 14	పాలకుర్తి	16 పంచాయతీలు	నోటిఫికేషన్	నవంబరు 30
	అంతర్గాం	15 పంచాయతీలు	నామినేషన్లు	నవంబరు 30 నుంచి డిసెంబరు 2
	ధర్మారం	29 పంచాయతీలు	నామినేషన్ల పరిశీలన	డిసెంబరు 3
	జూలపల్లి	13 పంచాయతీలు	ఉపసంహరణ గడువు	డిసెంబరు 6
			పోలింగ్	డిసెంబరు 14
	మొత్తం 73 పంచాయతీలు, 684 వార్డులు		(సమయం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 వరకు)	
మూడో విడత డిసెంబరు 17	సుల్తానాబాద్	27 పంచాయతీలు	నోటిఫికేషన్	డిసెంబరు 3
	ఎలిగేడు	12 పంచాయతీలు	నామినేషన్లు	డిసెంబరు 3 నుంచి 5
	పెద్దపల్లి	30 పంచాయతీలు	నామినేషన్ల పరిశీలన	డిసెంబరు 6
	ఓదెల	22 పంచాయతీలు	ఉపసంహరణ గడువు	డిసెంబరు 9
			పోలింగ్	డిసెంబరు 17
	మొత్తం 91 పంచాయతీలు, 852 వార్డులు		(సమయం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 వరకు)	

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు గడువులోగా పూర్తి చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ పెండింగ్ దరఖాస్తులను డిసెంబర్ 31లోగా సమర్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్సీ విద్యార్థుల పెండింగ్ ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 5 నుంచి 10వ తరగతి, ప్రైవేటు పాఠశాలల్లో 9 నుంచి 10వ తరగతి చదివే ఎస్సీ విద్యార్థుల దరఖాస్తులను త్వరగా సమర్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. ఇందులో 5 నుంచి 8వ తరగతి విద్యార్థినులకు రూ.1500, బాలురకు రూ.వెయ్యి సంవత్సరానికి, 9, 10 చదివే బాలబాలికలకు రూ.3500 స్కాలర్‌షిప్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి త్వరగా దరఖాస్తులు చేసుకునేలా చూడాలని కోరారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, హెచ్‌డబ్ల్యుఓలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తేమ శాతం వచ్చేలా రైతులు సహకరించాలి



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు సంభవిస్తున్న దృష్ట్యా రైతులు ధాన్యం ఆరబోసుకుని తేమ శాతం వచ్చేలా సహకరించాలని అదనపు కలెక్టర్ వేణు కోరారు. మండల కేంద్రంతోపాటు పారుపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ధాన్యం తూకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దళారులకు ధాన్యం అమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలను వేగవంతం చేయాలని అధికారులను, సెంటర్ ఇన్‌ఛార్జిలకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాలన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి ఉన్నారు. పెద్దపల్లి డిఆర్‌డిఓ కాళిందిని హరిపురం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ సమీక్ష

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డి.వేణు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎస్‌ఐ ఎస్.రవికుమార్‌తోపాటు ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. అభ్యంతరాలు తలెత్తే గ్రామాలు, సున్నిత ప్రాంతాలను గుర్తించి వాటిని బ్లాక్‌స్పాట్లుగా గుర్తించాలని, అక్కడ అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు పూర్తిగా జరుగుతున్నాయని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి



డెంటల్ క్లీనిక్ డాక్టర్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ధర్మారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పర్మిషన్ లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పర్మిషన్ లేకుండా హాస్పిటల్స్ ఎలా నిర్వహిస్తారని సాయిరాం హాస్పిటల్, కాస్మోడెంట్ డెంటల్ క్లినిక్ ఆసుపత్రి వైద్యులతో పాటు వాటి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్మిషన్ లేకుండా నడుపుతున్న ఆసుపత్రులకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. హాస్పిటల్ నిర్వాహించే వారు ప్రోటోకాల్ బేసిడ్ ట్రీట్మెంట్, ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు పాటించాలని డిమాండ్ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం అల్లోపతి, హోమియో, యునాని, ఆయుర్వేద, డెంటల్, ఫిజియోథెరపి నిర్వహిస్తే వైద్య ఆరోగ్య శాఖ వద్ద వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకొని ముందస్తు అనుమతులు పొం దాలని సూచించారు. జిల్లా వైద్య ఉప అధికారి డాక్టర్ శ్రీరాములు, డిప్యూటి డెమో వెంటేశ్వర్లు ఉన్నారు.

అరచేతిలో 'మీసేవ'..



- వాట్సాప్ ద్వారా అందుబాటులోకి 20కి పైగా సర్వీసులు
- దరఖాస్తు మరింత సులభతరం
- సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్
- ప్రజలకు, విద్యార్థులకు తీరనున్న కష్టాలు

6లో

బాలికల విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దయా అరుణ, రంగవల్లులు వేసిన విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్య ద్వారనే మహిళా సాధికారతను సాధించవచ్చని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త డా. దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ జాబు సుచరిత అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై మంగళవారం మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై రంగవళ్లుల పోటీలు నిర్వహించారు. రంగవళ్ళులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు సందేశాత్మకత ఉట్టిపడేట్టుగా ప్రతిభా పాటవాలు కనబరిచిన పిల్లలకు బహుమతులను అందించారు. విద్యార్థులకు బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలపై గృహహింస, వయోవృద్ధుల రక్షణ, దివ్యాంగులపై వివక్షను నిర్మూలించడానికి టోల్‌ఫ్రీ నంబర్లపై వివరించారు. టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించిన వివరాలను ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వంద శాతం హాజరు కలిగిన పిల్లలకు కమల ఫౌండేషన్ అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు సర్దార్ అబ్దుల్ హైజావీద్, ఉపాధ్యాయులు కూకట్ల తిరుపతి, బాదం జ్యోతి, కరాటే మాస్టర్ కొండిల్ల సదానందం, కాంపెల్లి కొమురయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఖనిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలుపడంతో మంగళవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గాన్ని మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పెట్టుకున్నారని, రామగుండం ప్రజల చిరకాల కోరిక అయిన 800మెగావాట్లకు మంత్రివర్గం ఆమోదం తెలుపడం హర్షనీయమన్నారు. విద్యుత్ ప్లాంట్ ఆమోద ముద్రవేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కాల్వ లింగస్వామి, నాయిని ఓదెలు, పాతపెల్లి ఎల్లయ్య, ఫజల్ బేగ్, కొప్పుల శంకర్, ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, గడ్డం శ్రీనివాస్, గట్ల రమేష్, తాళ్లపల్లి యుగంధర్, కళ్యాణి సింహాచలం, అనుమ సత్యనారాయణ, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామగుండానికి డబుల్ బొనాంజా

- క్యాబినెట్‌లో రెండు విద్యుత్ కేంద్రాలకు ఆమోదం...
- 800మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపన...
- మేడిపల్లి ఓసీపీలో 500మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్
- రూ.1700కోట్ల పెట్టుబడులు...
- ఎన్‌టీపీసీ సహకారంతో థర్మల్ ప్లాంట్ నిర్మాణం

6లో

కాంగ్రెస్ నాయకులే ఇసుక మాఫియా అవతారం ఎత్తారు

- ఇసుక కోసం గుంపుల చెక్ డ్యామ్‌ను పేల్చేశారు
- మాజీ మంత్రి హరీష్ రావు

7లో



గుంపుల చెక్ డ్యాం వద్ద మాట్లాడుతున్న హరీష్‌రావు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం

మాజీ ఎమ్మెల్యే చందర్‌తో పాటు నాయకుల ముందస్తు అరెస్టు



కోరుకంటి చందర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గోదావరిఖని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునివ్వడంతో మంగళవారం పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. చందర్‌తో పాటు పలువురు నాయకులు మంగళవారం ఉదయమే కళ్యాణ్‌నగర్ చౌరస్తా వద్ద వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. వారిని మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులను ఎన్‌టీపీసీ, యైటింక్లయిన్‌లో అదుపులో తీసుకొని రాణాలకు తరలించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదుపులోకి తీసుకున్న బీఆర్‌ఎస్ నాయకులను సాయంత్రం వదిలిపెట్టారు. మైసమ్మ గుళ్లను కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలని, సింగరేణి నిర్మిస్తున్న వ్యాపార సముదాయంలో కూల్చివేతలకు గురైన చిరు వ్యాపారులకు ఉచితంగా దుకాణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక చౌరస్తా, గాంధీనగర్ ఎన్‌టీపీసీ ఏరియాలో చిరు వ్యాపారుల దుకాణా లను కూల్చివేసి వారి కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. ఇక్కడ పోలీసు పాలన నడుస్తోందని శాంతియుతంగా బీఆర్‌ఎస్ చేపట్టిన చలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కార్యక్రమాన్ని అడ్డగించి బీఆర్‌ఎస్ శ్రేణులను అరెస్టు చేయడం దారుణం అన్నారు. బొడ్డు రవీందర్, బాదె అంజలి, చెలకలపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, మేతుకు దేవరాజ్, జక్కుల తిరుపతి, దొమ్మేటి వాసు, బుర్రి వెంకటేష్, నట్టు శ్రీనివాస్, నీరటి శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, జిట్టవేన ప్రశాంత్ కుమార్, కిరణ్ జీ, చింటూ ఆవునూరి వెంకటేష్, ముద్దసాని సంధ్యారెడ్డి, లక్ష్మి, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ

ఎలిగేడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసినట్లు ఏపీఎం గీత తెలిపారు. మండలంలోని 22 గ్రామైక్య సంఘాల పరిధిలో 5495 చీరలు రాగా, వాటిని 12 గ్రామాల్లో 22 మంది వీఓఏల ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. సీసీ పద్మ, వీఓ అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రైతు ఖాతాకు బదులు రాజన్న ఖజానాకు..

- పత్తి విక్రయించిన మహిళా రైతు..
- సాంకేతిక లోపం అని తేల్చిన అధికారులు
- ఇరవై రోజులకు రైతు ఖాతాలో జమ


సత్తమ్మ

వేములవాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి పత్తి విక్రయించిన రైతు ఖాతాలోకి కాకుండా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి డబ్బులు జమ అయ్యాయి. దీంతో బ్యాంకు, దేవస్థానం, మార్కెట్ యార్డు, సీసీఐ చుట్టూ తిరగడంతో చివరికి 20రోజులకు ఆమె ఖాతాలోకి డబ్బులు చేరాయి. వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఏదుల సత్తమ్మకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో నాలుగు ఎకరాల్లో కుమారుడు వెంకటేశ్ పత్తివేశాడు. ఈ పత్తిపంటలో పండిన పత్తిని ఈనెల 6న వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లి లక్ష్మీనర్సింహ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో 27క్వింటాళ్ల పత్తిని విక్రయించారు. వరంగల్ సీసీఐ ద్వారా 2,11,549 రూపాయలు సత్తమ్మ ఖాతాలో జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు మెస్సెజ్ వచ్చింది. ఈనెల 11న వేములవాడ ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా ఖాతాలో డబ్బులు లేవని సిబ్బంది చెప్పారు. కుమారుడితో పాటు ఆమె బ్యాంకు మేనేజర్ సంపత్‌ను అడుగడంతో అసలు విషయం బయటపడింది. డబ్బులు రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి మళ్లాయి. ఆమె ఆధార్ లింకు దేవస్థానం ట్రస్టు ఖాతాకు లింకు అయి ఉంది. ఏడాదిగా వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు ఎస్‌ఆర్‌ఆర్ ట్రస్టు ఖాతాలోనే జమ అవుతున్నట్లు గుర్తించారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి అధికారి రఘురాంను కలిసి జరిగిన విషయాన్ని చెప్పడంతో వరంగల్‌లోని రీజినల్ కార్యాలయానికి లేఖ రాశారు. సాంకేతిక లోపంతో రైతు ఖాతాలోకి చేరాల్సిన డబ్బులు రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు ఖాతాలోకి వెళ్లాయని, ఈ డబ్బులు తిరిగి సీసీఐకి జమ చేయాలని వరంగల్ నుంచి ఈనెల 20న లేఖ వచ్చింది. ఆ తర్వాత రైతు, బ్యాంకు అధికారులు ఆలయ ఈవోను కలిసి సమస్య వివరించారు. ఎట్టకేలకు 2,11,549 రూపాయలు ట్రస్టు ఖాతా నుంచి రైతు ఖాతాకు మళ్లించారు. దీంతో ఆ మహిళా రైతు బ్యాంకు నుంచి మంగళవారం డబ్బులు డ్రా చేసుకొని ఊపిరి పీల్చుకుంది.

అడవి శ్రీరాంపూర్‌లో బెల్లం పానకం ధ్వంసం

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంథని ఎక్సైజ్ పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయి తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో మంథని ఎక్సైజ్ ఎస్‌ఐ సాయికుమార్ తన సిబ్బందితో దాడులు చేపట్టారు. అక్కడ నాటు సారాయికి తయారీగా ఉన్న సుమారు 300 లీటర్ల ఇప్ప పువ్వు, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నిషేధిత గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబాపై ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు అందించాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్, రఘు, నిరంజన్, రవి పాల్గొన్నారు.

- వాట్సాప్ ద్వారా అందుబాటులోకి 20కి పైగా సర్వీసులు
- దరఖాస్తులకు మరింత సులభతరం
- సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్
- ప్రజలకు, విద్యార్థులకు తీరనున్న కష్టాలు



అరచేతిలో మీసేవ

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏదైనా అప్లై చేయాలంటే మీ సేవ చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యంగా పిల్లల చదువుల కోసం కులం, నివాసం, ఆదాయ సర్టిఫికెట్ కోసం మీ సేవల వద్ద గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేది. ఈ సమస్యలకు చెక్ పెడుతూ మీసేవ సర్వీసును ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నేరుగా వాట్సాప్ ద్వారానే సేవలు పొందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ డిజిటల్ సేవలను ఈ నెల 18న మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇక నుంచి కేవలం వాట్సాప్‌లో మెసేజ్ పెడితే 20కి పైగా మీసేవ సర్వీసులను పొందవచ్చు. వాట్సాప్ 8096958096 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు వెంటనే రిప్లైలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకొని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్డేట్‌తోపాటు ఆమోదం పొందిన సర్టిఫికేట్‌ను డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈ మార్పుతో ప్రజలకు మరింత సులభంగా.. వేగంగా.. ప్రభుత్వ సేవలు అందుతాయని అధికారులంటున్నారు.

అందుబాటులో ఉండే సేవలు ఇవే...

ప్రస్తుతం 20 పైగా సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయి. మరిన్ని సేవలను చేర్చే పనిలో అధికారులు ఉన్నారు. ఇక ఫోన్ ద్వారానే ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రం, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నల్లా, కరెంటు బిల్లులు, పోలీస్ చలాన్స్, ఆర్టీఏ లైఫ్ టాక్స్ చెల్లించ వచ్చు. ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ పర్మిషన్లు, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో మ్యూటేషన్ దరఖాస్తులు, ఆస్తి పన్నులు చెల్లించుకోవచ్చు. దేవాలయాల సమాచారం, దైవ దర్శనాల స్లాట్ బుకింగ్, గదుల బుకింగ్, ఆన్‌లైన్ పూజా బుకింగ్ సౌలభ్యం ఇందులో ఉంది. రేషన్ కార్డుల జారీ, రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్, వ్యవసాయ మార్కెట్ ధరలు ఇలా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

● ఆన్‌లైన్‌లో నమోదు.. డౌన్‌లోడ్

అధికారిక నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే నమస్కారం.. తెలంగాణ మీసేవకు స్వాగతం. మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లై వస్తుంది. అందుబాటులో ఉన్న సర్వీసుల మెనూ కనిపిస్తుంది. అందులో దరఖాస్తును ఎంచుకో వాలి. దరఖాస్తును పూరించి అవసరమైన డాక్యుమెంట్లు, ఫొటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన ఫీజును యూపీఐ ద్వారా సుర క్షితంగా చెల్లించవచ్చు. ఆ తర్వాత దరఖాస్తు స్టేటస్, అప్డేట్స్ అన్ని వాట్సాప్ లోనే మెసేజ్ రూపంలో వస్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దర ఖాస్తు పరిశీలించిన అధికారులు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారు. సర్టిఫికేట్ సిద్ధం కాగానే దాని డౌన్‌లోడ్ లింక్ ఫోన్‌కు వస్తుంది. దాన్ని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకొని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. అవసరమైతే ప్రింట్ కూడా తీసుకొని వాడుకోవచ్చు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవదహనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మాధవి


కేసు వివరాలు వెల్లడిస్తున్న హుజూరాబాద్ ఏసీపీ మాధవి

సైదాపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల సుకృతను ఆమె భర్త చింతకుంట్ల మహిపాల్‌రెడ్డి పథకం ప్రకారం తమ వ్యసాయ భూమి వద్ద పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. మంగళవారం సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. హుజూరాబాద్ మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన సుకృతను 2000 సంవత్సరంలో రాములపల్లి గ్రామానికి చెందిన చింతకుంట్ల మహిపాల్‌రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. 2002లో మహిపాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మేకల విజయను ప్రేమ పేరుతో తీసుకెళ్లగా విజయ కుటుంబ సభ్యులు వారిని వరంగల్‌లో పట్టుకొని తీసుక రాగా విజయ ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది. సుకృత-మహిపాల్‌రెడ్డి మధ్య గొడవలు జరుగుతుండగా సుకృత గ్రామంలోనే ఓ ఇంట్లో కిరాయికి ఉంటోంది. 2009లో మహిపాల్‌రెడ్డి మళ్లీ రమాదేవి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. దాంతో సుకృత మహిపాల్‌రెడ్డిపై వరకట్నం, రెండో వివాహంపై, మెయింటినెన్స్ కేసు వేసింది. చాలాసార్లు సుకృత మహిపాల్‌రెడ్డి మధ్య పంచాయతీలు జరిగాయి. చివరకు మహిపాల్‌రెడ్డి సుకృతకు 20 గుంటల భూమి ఇచ్చాడు. ఆ భూమిని సుకృత తన కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేయడంతో మహిపాల్‌రెడ్డి సుకృతపై కోపం పెంచుకున్నాడు. సుకృతను చంపుతానని గతంలో చాలాసార్లు బెదిరించాడు. ఈ నెల 21న సైదాపూర్-హుజూరాబాద్ రోడ్డులోని జాగీర్‌పల్లి పెట్రోల్ బంకులో పెట్రోలు కొనుగోలు చేసి ముందుగానే రాములపల్లి శివారులోని తన వ్యవసాయ భూమి వద్ద తాటి కమ్మల కింద దాచి పెట్టాడు. ఈ నెల 22న మధ్యాహ్నం తమ వ్యవసాయ భూమి వద్ద సుకృత ఒంటరిగా వ్యవసాయ పనులు చేస్తుండగా మహిపాల్‌రెడ్డి సుకృతపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేసి పరారయ్యాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం నిందితుడు మహిపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మాధవి తెలిపారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



రామగుండానికి డబుల్ బొనాంజా

- క్యాబినెట్‌లో రెండు విద్యుత్ కేంద్రాలకు ఆమోదం
- 800మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపన
- మేడిపల్లి ఓసీపీల్లో పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్

గోదావరిఖని, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండానికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బొనంజా ప్రకటించింది. మంగళవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో రూ.17వేల కోట్ల పెట్టుబడులతో రెండు విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఆమోద ముద్ర వేసింది. జీవిత కాలం ముగియడంతో మూతబడిన బీ థర్మల్ స్థానంలో ఎన్‌టీపీసీ సహకారంతో 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.13వేల కోట్ల పెట్టుబడితో ఈ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. జెన్‌కో దగ్గర వనరులు అందుబాటులో లేకపోవడంతో ఎన్‌టీపీసీ సహకారంతో విద్యుత్ కేంద్రం నిర్మించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఎన్‌టీపీసీ యాజమాన్యం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. రాష్ట్రంలో జాయింట్ వెంచర్‌లో కానీ, స్వతహాగా కానీ విద్యుత్ కేంద్రాల స్థాపనకు ఆసక్తి కనబరిచింది. ఈ పరిస్థితుల్లో రామగుండం బీ థర్మల్ స్థానంలో ఏర్పాటు చేయనున్న కొత్త విద్యుత్ కేం ద్రాన్ని ఎన్‌టీపీసీ సహకారంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో సింగరేణితో జాయింట్ వెంచర్ చేయాలని భావించినా ఇప్పుడు ఎన్‌టీపీసీ ముందుకు రావడంతో ఎన్‌టీపీసీని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. తద్వారా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలగనున్నది. అలాగే రామగుండం పట్టణం పక్కనే ఉన్న మేడిపల్లి ఓసీపీలో సుమారు రూ.4వేల కోట్ల సింగరేణిలోనే మొదటిసారిగా పంప్‌డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పవర్‌ప్లాంట్ నిర్మాణం జరిగితే సింగరేణి సంస్థ భవిష్యత్‌లో మరిన్ని పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లు నిర్మించేందుకు మార్గం ఏర్పడుతుంది. ఈ రెండు భారీ ప్రాజెక్టులు రామగుండానికి రావడంతో స్థానికంగా హర్షం వ్యక్తం అవుతుంది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రామగుండం పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చుకునేందుకు ముఖ్యమంత్రి, మంత్రులపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండడంతోపాటు ప్రభుత్వంలో కీలకం కావడంతో ఈ ప్లాంట్ ప్రకటనకు పూర్తిగా సహకరించారు.



ప్రకటన చేస్తున్న మంత్రులు, చిత్రంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండానికి సీఎం ప్రాణం పోశారు...

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



రామగుండంలో నిజాం హయాంలో విద్యుత్ కేంద్రాల స్థాపన జరిగింది. అవి జీవితకాలం ముగియడంతో మూతబడ్డాయి. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి రామగుండానికి విద్యుత్ కేంద్రాలు మంజూరు చేసి ప్రాణం పోశారు. ప్రజల మనోభావాలు, సెంటిమెంట్లు, ఉపాధిని పరిగణలోకి తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకరించారు. జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు రుణం తీర్చుకోలేనిది.

భూ సేకరణ అవసరం ఉండదు...

రామగుండంలో విద్యుత్ కేంద్రం నిర్మాణంలో ఎన్‌టీపీసీ భాగస్వామ్యం అయితే భూసేకరణ అవసరాలు కూడా ఉండదు. పక్కనే ఉన్న కుందనపల్లి యాష్‌పాండ్‌ను కానీ, రాజాపూర్‌లో నిర్మించనున్న యాష్ పాండ్‌ను కానీ వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

గుప్త నిధులు ఉన్నాయని మోసం చేసిన వ్యక్తులపై కేసు

కోనరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు వేణు ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని వాటిని తీయడానికి ఖర్చు అవుతాయని నాలుగు లక్షల ఎనిమిది వేల రూపాయలను పెద్దూరు గ్రామానికి చెందిన మేకల నరేష్, కడవంచ ప్రసాద్, నదుల దేవేందర్, నదుల రాజేశం కాజేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


రాములు(ఫైల్)

కోల్‌సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన బండారి రాములు(56) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాములు కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన రైతు గట్టయ్య ఇంటి ముందు ఉన్న పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు స్థానిక రైతులు తెలిపారు. పంట పొలం కోసి మిగిలిన గడ్డిని పశువుల కోసం ఇంటి ఎదుట కుప్పగా ఏర్పాటు చేసుకోగా ప్రమాదవశాత్తు మంటలు చేలరేగాయి. స్థానికుల సహాయంతో ఆర్పివేశారు. దీంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోగా ప్రభుత్వపరంగా సహాయం అందించాలని రైతు గట్టయ్య కోరారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- స్థానిక ఎన్నికల్లో పోటీచేస్తే బీ-ఫాం, ప్రచార సామగ్రి ఇస్తాం
- రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమసమాజ నిర్మాణం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి పార్టీ బీ-ఫామ్‌తోపాటు కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రి ఉచితంగా అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువకులకు లోక్‌దళ్ పార్టీ ప్రోత్సాహం ఇస్తుందన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలు అంటే జోక్‌గా మారిందని, మద్యం, డబ్బుల పంపిణీ లేకుండా ఎక్కడ ఏ ఎన్నికలు జరుగడం లేదని, మద్యం పంపిణీ జరుగుతుందని మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వీడియో తీసి ఎన్నికల కమిషన్‌కు పంపిస్తే చర్యలు తీసుకోవలసింది పోయి రెండు బాటిళ్ల వరకు మద్యం పంపిణీ చేయవచ్చని సమాధానమిచ్చారని, ఇప్పుడు ఎన్నికల తీరు ఇలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ ప్రక్రియలో, రాజకీయాల్లో సంస్కరణలు రావలసిన అవసరముందని, అందుకోసం లోక్‌దళ్ పార్టీ ప్రజలను చైతన్యపరిచేందుకు కృషిచేస్తుందని అన్నారు. 30 సంవత్సరాలు ప్రభుత్వోద్యోగం చేసి తెలంగాణ సాధన ఉద్యమం కోసం పదవికి రాజీనామా చేసి 2001లో టీఆర్‌ఎస్ పార్టీలో ఫౌండర్ మెంబర్ కొనసాగిన తనను రెండు సార్లు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించారని గుర్తు చేశారు. సబ్బండ వర్గాలు ఉద్యమించి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ ధృతరాష్ట్ర పాలన, అవినీతిపాలన, కుటుంబపాలన చేశారని, విద్య, వైద్యం చిన్నాభిన్నం అయ్యాయని దిలీప్‌కుమార్ మండిపడ్డారు. దీనితో టీఆర్‌ఎస్‌లో కొనసాగకుండా బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌కుమార్ చేపట్టిన కార్యక్రమాలతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఆలోచనతో అందులోకి వెళ్లగా ఆయన రాష్ట్ర అధ్యక్ష పదవి పోయాక ఆ పార్టీలో ఏమీ మార్పు కనిపించలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో కంటే రేవంత్‌రెడ్డి పాలనలో ఊరికి ఆరుగురు చొప్పున దోపిడీ, అవినీతికి పాల్పడుతున్నారని ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, 28 లక్షల వృత్తి నైపుణ్య శిక్షణలు పూర్తి చేడయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్రీయ లోక్‌దళ్ జిల్లా బియ్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శులు మడకం ప్రసాద్, దొర, రిషబ్, నర్సింహారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు గౌర బీరప్ప, సిద్దం కుమార్, సతీష్, రాంప్రసాద్, సుధాకర్, బుల్లెట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్‌కుమార్

రాష్ట్రస్థాయి పద్య రచనలో విద్యార్థినుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సారిక, దివ్యజ్యోతి, హర్షిణి, సంజన, నందినిలు రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో ప్రతిభ కనబర్చారని పాఠశాల హెచ్ఎం మనోహరచారి మంగళవారం తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషతు ఆధ్వర్యంలో నిర్వహించిన పద్య రచన పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటారని పేర్కొన్నారు.

జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పద్య రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజన్‌రెడ్డి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


నీరజ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన వివాహిత అందె నీరజ (25) అనే వివాహిత మంగళవారం అనునమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని అందె దేవరాజుకు 2014లో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన వంగ రాజవ్వ-నాంపల్లి దంపతుల కూతురు నీరజతో వివాహమైంది. ఆ దంపతులకు కుమారుడు జోసిత్ ఉన్నాడు. ఉపాధి నిమిత్తం దేవరాజు యేడాది కిందట దుబాయి దేశానికి వలస వెళ్లాడు. అక్కడ ఆయన తన మామ, బావమరిదితో కలిసి ఉంటున్నాడు. నీరజ తన కొడుకు జోసిత్‌తో కలిసి జీవిస్తోంది. కొడుకు పాఠశాలకు వెళ్లిన అనంతరం వివాహిత నీరజ ఇంటికి గడియ వేసుకుంది. అనుమానం వచ్చిన చుట్టు పక్కల వారు పిలిచినా స్పందించకపోవడంతో వారు అన్నారంలోని నీరజ తల్లి రాజవ్వకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూసేసరికి కూతురు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించింది. మృతురాలు తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు. మృతిపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో ఇసుక ట్రాక్టర్లను రైతులు మంగళవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ అనుమతితో నడిపిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గ్రామస్థులు, రైతులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. కనగర్తి మూలవాగు నుంచి ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరుకు ఇబ్బందికరంగా మారుతుందని రైతులు తెలిపారు. గ్రామ పరిధిలోనే అనుమతి ఇవ్వాలని, వేరే గ్రామాలకు అనుమతి ఇవ్వడం వల్ల వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని అన్నారు. తమ గ్రామం నుంచే కాకుండా మూలవాగు పరిసర ప్రాంతాల నుంచి ఇవ్వాలని కోరారు.


కనగర్తిలో నిలిచిన ఇసుక ట్రాక్టర్లు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన గోదారి చంద్రయ్య అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు రెండు ఎద్దులు మేత కోసం గ్రామ శివారు వద్దకు తీసుకు వెళ్లి మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు తగిలి షాక్‌తో ఎద్దు మృతి చెందిందని తెలిపాడు. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు చంద్రయ్య పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కొల్లాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అబ్దుల్(40) ద్విచక్రవాహ నంపై కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్నాడు. మానకొండూరు మండలంలోని చెంజర్ల బ్రిడ్జి వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అబ్దుల్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దొంగతనం కేసులో ఒకరికి ఆరునెలల జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఒక వ్యక్తికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పును వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం బాబు అనే వ్యక్తి తన భార్య శీలం పద్మను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి కోసం చేర్పించాడు. ఈ క్రమంలో తన వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు బాబు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ వినీత్‌రెడ్డి వాహనం కోసం గాలిస్తుండగా వాహనాన్ని దొంగిలించిన దుర్శెట్ల నరేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో సీఎంఎస్ ఎస్ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ప్రవీణ్ నరేష్‌కు ఆరు నెలల జైలు శిక్షను విధించారు.

జాతీయ కళా ఉత్సవాల్లో తృతీయ బహుమతి



జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ కళా ఉత్సవాల్లో నవోదయ విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతులు సాధించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ కళోత్సవాల్లో 9వ తరతి విద్యార్థి ఎం కార్తికేయ, 10వ తరగతి విద్యార్థి జి వంశీ ఇండిజీనియస్ టాయ్స్ మేకింగ్ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతులు సాధించారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఆర్ట్ టీచర్ నాగేశ్వర్‌రావును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

పలు నిర్మాణాల కూల్చివేత



రోడ్డు విస్తరణలో నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

వేములవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అమర వీరుల స్తూపం నుంచి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు నిర్మాణాల కూల్చివేతలను మంగళవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చిన వరకు నిర్మాణాలను కూల్చి వేశారు. కాగా పలువురు ఇంటి యజమానులు మార్కింగ్ దాటి ముందుకు వచ్చి నిర్మాణాలను తొలగిస్తున్నారని కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించారు. రోడ్డు విస్తరణకు సంబంధిత అధికారులు ఇచ్చిన మార్కింగ్ వరకు తొలగిస్తున్నట్లు తెలిపారు.

- ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు
- వచ్చే ఏడాది జనవరిలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
- కోచింగ్ సెంటర్లకు డిమాండ్

టెట్‌కు వేళాయె..



జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు నోటిఫికేషన్ రావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిరపడాలనుకునే బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనుందనే వార్తల నేపథ్యంలో చాలా మంది టెట్‌లో అత్యధిక మార్కులు సాధించాలనే తపనతో ప్రిపేర్ అవుతు న్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హత సాధించాలని నిబంధన విధించడంతో వారు కూడా దరఖాస్తు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు టెట్ దరఖాస్తులను స్వీకరించ నున్నారు. వచ్చే యేడాది జనవరి 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు వురు అభ్యర్థులు ఇప్పటికే టెట్ రాసేందుకు కోచింగ్ సెంటర్లను ఆశ్రయించగా మరికొందరు గ్రంథాల యాల్లో, ఇంటి వద్ద సొంతంగా ప్రిపేర్ అవుతున్నారు.

● సెలవుల్లో పలువురు ఆశావహులు..

వచ్చే యేడాది జనవరిలో పరీక్ష నిర్వహిం చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టెట్ పరీక్షకు జగిత్యాల జిల్లా నుంచి సుమారు 5 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రస్తుతం అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో టెట్ క్వాలిఫై అయిన వారు మార్కులు మెరుగు పర్చుకునేందుకు మళ్లీ టెట్ రాసే అవకాశం ఉంది. ఉపాధ్యాయ కొలువుకు టెట్ క్వాలిఫై తప్పనిసరి కావడంతో పరీక్షకు సన్నద్ధం కావడానికి పలువురు టీచర్లు సెలవు బాట పడుతున్నారు.

● ప్రభుత్వ టీచర్లకూ తప్పనిసరి

సెప్టెంబరు 1వ తేదీన వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఐదు సంవత్సరాల పైబడి సర్వీస్ ఉన్న టీచర్లు పదోన్నతి అవసరమునుకుంటే రాబోయే రెండేళ్లలో టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని, లేదంటే ఉద్యోగాలు కోల్పోతారని సుప్రీం కోర్టు తీరు వెలువరించింది. దీనిపై విద్యాహక్కు చట్టం అమలులోకి రాకముందు ఉన్న టీచర్లకు టెట్ మినహాయింపు కావాలని కోరుతూ, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన టెట్‌లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. కోర్టు ఆదేశాల మేరకు టెట్ తప్పనిసరిగా ఇన్ సర్వీస్ టీచర్లు రాయాలని చెబుతూ కొన్ని ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులకు టెట్ భయం పట్టుకుంది. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఎస్‌జీటీలు పేపర్-1, స్కూల్ అసిస్టెంటట్లు పేపర్-2 రాయాల్సి ఉంటుంది.

పార్లమెంట్‌లో చట్టం చేయాలి



-తిరుక్కోవెల శ్యామ్ సుందర్,
టీఎస్ యూటీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇవ్వాలి. ఇప్పటికే సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైతం ఈ మెయిల్, పోస్ట్ ద్వారా, నెలాఖరు వరకు ఎంపీలకు లేఖలు అందించనున్నాం. సర్వీసులో ఉన్న టీచర్ల రక్షణ కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలి.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి



-బోయినిపల్లి ఆనందరావు,
పీఆర్‌టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు ఇప్పటికే వినతిపత్రం ఇచ్చాం. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ మినహాయింపు అవసరం.

కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె వసంత్ కుమార్ జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కరాటే పెటీల్లో ఆయన చీఫ్ రెఫరీగా విధులను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వసంత్‌కు మాస్టర్లు పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని చేపూరి మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌లో నిలకడగా నీరు

జగిత్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం స్వల్పంగా నీరు వస్తోంది. దీంతో డ్యామ్‌లో నీరు నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

కాంగ్రెస్ నాయకులే ఇసుక మాఫియా అవతారం ఎత్తారు

- ఇసుక కోసం గుంపుల చెక్ డ్యామ్‌ను పేల్చేశారు - మాజీ మంత్రి హరీష్ రావు



కూలిన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు

జమ్మికుంట రూరల్/ఓదెల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ నాయకులు పలు జిల్లాల్లో ఇసుక మాఫియా అవతారం ఎత్తారని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఓదెల మండలం గుంపుల, జమ్మికుంట మండలం శంభునిపల్లి, తనుగుల మధ్యనున్న మానేరు వాగులో కూలిపోయిన చెక్ డ్యామ్‌ను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ గుంపుల, శంభునిపల్లి చెక్‌డ్యామ్‌ను ఇసుక మాఫియానే కూల్చిందన్నారు. దీనిని కొందరు కాంగ్రెస్ పెద్దలు ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక రవాణాకు అడ్డంకిగా ఉన్నాయనే ఉద్దేశంతో పలు జిల్లాల్లో చెక్ డ్యాములను జిలెటిన్ స్టిక్‌లతో పేల్చివేశారని, దీంతో మత్స్యకారులు, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో పెద్దపల్లి మండలం భోజన్నపేట హుస్సేన్‌మియా వాగులోని చెక్ డ్యాంను ఇసుక మాఫియా పేల్చివేయగా రైతులే జిలెటిన్ స్టిక్‌లతోపాటు, ట్రాక్టర్లను, నిందితులను పట్టుకున్నారన్నారు. వారిని పోలీసులకు అప్పజెప్పినా కేసు నమోదు కాలేదన్నారు. అప్పుడు వందల మంది రైతులు ఇసుక మాఫియాపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, అప్పుడే చర్యలు తీసుకున్నట్లయితే నేడు గుంపుల మానేరు వాగులోని చెక్ డ్యామ్ దెబ్బతినేది కాదన్నారు. చెక్ డ్యామ్‌ను పేల్చివేశారని మత్స్యకారులే చెబుతున్నారని, శనివారం పొద్దంతా మానేరు నిండా నీరు ఉందని, తెల్లవారే సరికి కూలిపోయి ఉందని కార్మికులు తెలిపారన్నారు. వర్షాకాలంలో చెక్ డ్యాంపై నీటి ప్రవాహం రోజుల తరబడి వెళ్లినప్పుడే ఏమి కాలేదని, నీటి ప్రవాహం, వర్షాలు తగ్గిన తర్వాత చెక్ డ్యామ్ ఎలా కూలిపోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యం కొనసాగుతుందని, ప్రస్తుతం వాగులోని చెక్ డ్యామ్‌ను పేల్చివేసిన నిందితులపై కేసు నమోదు చేసి, నిర్మాణ వ్యయం 24 కోట్లను రికవరీ చేసి ఉన్నత స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు పొనగంటి సంపత్, పింగిలి రమేష్, మడికొండ సురేందర్ రావు, మునిపట్ల తిరుపతిరెడ్డి, పోడేటి రామస్వామి, రఘువీర్‌సింగ్, గంట రాములు, వంగల తిరుపతి రెడ్డి, నూనేటి సంపత్, ఐరెడ్డి వెంకటరెడ్డి, కనికి రెడ్డి సతీష్, ఆరెల్లి మొండయ్య, కాంతాల సదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం

మల్యాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సోమవారం రాత్రి వరకు చేరుకున్న వారితో పాటు వేలాదిగా వచ్చిన భక్తులు వేకువ జాము నుంచే బారులుతీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాల నుంచి అధికసంఖ్యలో వచ్చిన భక్తులతో కొండంతా రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగ కుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాగా జైజంక్షన్, ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలకు అస్తవ్యస్త పార్కింగ్‌తో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు భక్తులు భక్తులు అంజన్నను దర్శించుకున్నారు.

మూడు నెలలు.. ముహూర్తాలు కరువు

- రేపటి నుంచి శుక్ర మౌఢ్యం
- డిసెంబరు 21 నుంచి పుష్యమాసం



కరీంనగర్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు నెలల పాటు వివాహాది శుభ ముహూర్తాలు లేవు. నవంబ రు 27 గురువారం నుంచి ఫిబ్రవరి 17, 2026 వరకు శుక్రమౌఢ్యం కొనసాగనుంది. శూన్యమాసంగా పిలిచే పుష్యమాసం డిసెంబరు 20 నుంచి ప్రారంభమై జనవరి 18తో ముగుస్తుంది. జనవరి 19, సోమవారం నుంచి ఫిబ్రవరి 17 వరకు మాఘమాసం ఉంటుంది. మాఘ మాసం శుభ మాసమే అయినా ఈ మాసంలో మూఢం ఉండటంతో ముహూర్తాలు లేవు. మూఢం, పుష్య మాసంతో కలిపి చూస్తే సుమారు మూడు నెలల వరకు ముహూర్తాలు లేవు. తిరిగి ఫిబ్రవరి 19వ తేదీ గురువారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభం కానున్నాయి.

● పండగల వివరాలివే...

డిసెంబరు 1న గీతాజయంతి, 2న హనుమద్వ్రతం, 4న దత్తాత్రేయ జయంతి, 8న సంకటహర చతుర్థి. 16 నుంచి ధనుర్మాసారంభం, 18న మాస శివరాత్రి. 30న ముక్కోటి ఏకాదశి ఉంటుంది. జనవరి 6న సంకటహర చతుర్థి, 14న భోగి-గోదా కల్యాణాలు, 15న సంక్రాంతి, 16న కనుమ. 17న ముక్కనుమ, మాస శివరాత్రి. 23న వసంత పంచమి. 25న రథ సప్తమి. 29న భీష్మ ఏకాదశి, 31న శని త్రయోదశి ఉంటాయి. ఫిబ్రవరి 5న సంకటహర చతుర్థి, 13న షట్ తిల ఏకాదశి, 15న మహా శివరాత్రి నిర్వహిస్తారు.

నా భార్యను బలవంతంగా తీసుకెళ్లారు

- పోలీసులకు యువకుడి ఫిర్యాదు

మల్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఆమె కుటుంబసభ్యులు బలవంతంగా తీసుకెళ్లారని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మల్యాల మండల కేంద్రానికి చెందిన ముత్తుకుమార్ అనే యువకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన మాధవి అనే యువతిని ఈ నెల 16వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో ఆగ్రహంతో ఉన్న యువతి కుటుంబసభ్యులు ముత్తుకుమార్ ఇంటికి వచ్చి అతడి తల్లిదండ్రులపై కర్రలతో దాడి చేయడమే కాకుండా మాధవిని కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు మాధవి భర్త ముత్తుకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ పేర్కొన్నారు.

గంజాయి అమ్ముతూ, తాగిన వ్యక్తులకు జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో గంజాయి అమ్ముతూ తాగుతున్న ముగ్గురు వ్యక్తులకు 11 నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వీరభత్తిని అజయ్‌తో పాటు అదే మండలానికి చెందిన గట్టుపల్లి క్రాంతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కోర్టులో సీఎం ఎస్ఎస్ఐ శ్రావణ్ చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. దీంతో జడ్జి గట్టుపల్లి క్రాంతికి 11 నెలు జైలు శిక్ష, వీరబత్తిని అజయ్‌కి నెలరోజుల శిక్షతోపాటు 2,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో గంజాయి కేసులతో జక్కనపల్లి వివేక్‌కు నెలరోజుల జైలు శిక్షతో పాటు 2,500 రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తాం

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి - మహిళల జిల్లా కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



కరీంనగర్ జిల్లా మహిళా కబడ్డీ జట్టుతో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో ఆయన జిల్లా మహిళల కబడ్డీ జట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 11, 12, 13, 14 తేదీల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభచాటి విజేతలుగా నిలిచేందుకుగాను జట్లకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను సుడా ఆధ్వర్యంలో అందిస్తామన్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 66 మహిళలు, పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లకు, అధికారులకు, అఫీషియల్స్‌కు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అందరు సహాయసహకారాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధానకార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, ప్రతినిధి కొమురోజు కృష్ణ, వీరన్న, జిల్లా జట్ల కోచ్‌లు పద్మ, సుధాకర్, సీహెచ్ మల్లేశ్, సీనియర్ క్రీడాకారుడు నరోత్తం పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించండి

- డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి - పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా మహాసభ



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం రఘుశంకర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముస్కు రఘుశంకర్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగో మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సంస్థాగత జెండాను పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి మహేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎం రఘుశంకర్‌రెడ్డి, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో విద్యారంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టబడిందని, విద్యా ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయని విమర్శించారు. విద్యలో నాణ్యత కూడా లోపించిందన్నారు.

విద్య ద్వారానే మెరుగైన సమాజం సాధ్యపడుతుందన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి పరచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యకు అతి తక్కువ నిధులను కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పాఠ్యాంశాలను మారుస్తున్నారని పాఠ్యపుస్తకాల నుంచి చరిత్రను, సైన్స్‌లను తొలగిస్తున్నారని, పురాణ కథలను, వాస్తు జ్యోతిష్య శాస్త్రాలను పాఠ్యపుస్తకాల్లోకి ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని యూజీసీ నూతన నిబంధనలను తీసుకువచ్చిందని విద్యార్థులంతా వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయమైన విద్యావిధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పీడీఎస్‌యు 50 ఏళ్లుగా ఉద్యమిస్తోందని, ఎంతో మంది విద్యార్థులు అమరత్వం పొందారని అన్నారు. వారి ఆశయ సాధనకు పీడీఎస్‌యూ కృషి చేస్తుందని అన్నారు. డిసెంబరు 10,11,12 తేదీల్లో వరంగల్ జిల్లాలో 23వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, దీనికి విద్యార్థి లోకం కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్, జిల్లా నాయకులు రమేశ్, అజయ్, రాకేశ్, అస్లాం, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలకు చేయూతనివ్వండి

- అఖిలభారత మత్స్యకారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి స్టాన్లీ



సమావేశంలో మాట్లాడుతున్న స్టాన్లీ

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సహకార సంఘాలకు చేయూతనివ్వాలని అఖిలభారత మత్స్యకారుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కేరళ రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ స్టాన్లీ కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల నాలుగో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరింకల నర్సింహస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్టాన్లీ మాట్లాడుతూ సముద్రం లేకున్నా మత్స్య సంపద సమృద్ధిగా ఉన్నా- మత్స్యకారుల అభివృద్ధి మాత్రం జరగడం లేదన్నారు. మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మత్స్యకారులకు ఇంత వరకు సొంత ఇల్లు, చదువు, ఉద్యోగం లేదని కేవలం చేపలు పట్టుకొని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులను కలుపుకొని 77 నదులు ఉన్నాయని, 24వేల నదులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 10 లక్షల మంది మత్స్య వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమైనా సహాయం చేశాయా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సహకార సంఘాలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖ రిటైర్డ్ డీడీ మహిపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో చేప సీడ్ వేయకపోవడం వల్ల చేపల్లో అనుకున్నంతగా ఎదుగుదల లేదన్నారు. జూన్ లేదా జూలై నెలలో చేప పిల్లలను వేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య మాట్లాడుతూ మత్స్యమిత్ర మహిళా గ్రూపులను కొనసాగించాలని, మిడ్‌మానేరులో విస్తారంగా చేపలు పెంచే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, అంబటి వెంకన్న, జీవ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, మునిగల రమేశ్, వర్ధ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, బాలమణి, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోయిన శ్రీకాంత్, జునగరి లక్ష్మన్, మాటూరు సమ్మయ్య, అరుణ, శశికళ, జెడిగల రాజన్న, సత్తయ్య, పప్పు సదానందం, మాటూరి లక్ష్మణ్, యు శ్రీనివాస్, గడప నరసింహ స్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తజనసందడి



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులుతీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ బద్దిపోచమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తెల్లవారు జామునే పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడానికి భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులలు కిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిమంది భక్తులు చేరుకోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

పంచాయతీ ఎన్నికలకు మోగిన నగారా

(5వ పేజీ తరువాయి)

రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించారు. అలాగే రెండు ఆర్డినెన్స్‌లను కూడా గవర్నర్‌కు పంపించారు. అక్కడి నుంచి అవి రాష్ట్రపతి ఆమోదానికి వెళ్లినప్పటికీ ఆమోదం లభించలేదు. దీంతో ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవోలు జారీ చేసింది. ఆ వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబరు నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దానిని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహిస్తున్నారని, ఎన్నికలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. దీంతో పరిశీలించిన కోర్టు ఎన్నికల షెడ్యూల్‌పై స్టే విధిం చింది. దీనిపై ఆరు వారాల్లో అఫిడవిట్లు దాఖలు చేయాలని కోర్టు ఆదేశిం చింది. ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా పోతాయని భావించిన ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికల నిర్వహించాలని నిర్ణయించింది.

● బీసీలకు 69 స్థానాలు

జిల్లాలో గల 263 గ్రామపంచాయతీ ల్లో బీసీలకు సర్పంచ్ స్థానాల్లో 69 కేటాయించారు. 100 శాతం ఎస్టీలు గల గ్రామాలు మూడు ఉండగా, ఆ గ్రామాల్లో ఎస్టీలకు కేటాయించారు. అలాగే జనాభా ప్రాతిపదికన 3 స్థానాలు, ఎస్సీలకు 54 స్థానాలు, జనరల్‌కు 134 స్థానాలు కేటాయించారు. 2432 వార్డు స్థానాల్లో 100 శాతం ఎస్టి గ్రామాల్లో 20 స్థానాలు, ఎస్టీలకు 34 స్థానాలు, ఎస్సీలకు 484 స్థానాలు, బీసీలకు 699 స్థానాలు, జనరల్ కు 1205 స్థానాలు కేటాయించారు.

పలు ఠాణాలను సందర్శించిన డీసీపీ



టూటౌన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ

ముత్తారం, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజా భద్రత కోసం ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో ఉంటూ చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని డీసీపీ భూక్యా రాం రెడ్డి సిబ్బందికి సూచించారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్‌తో కలిసి ముత్తారం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లలో నమోదైన కేసుల వివరాలు, సమస్యలపై అధికారులతో సమీక్షించారు. డీసీపీ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ చర్యలు, లా అండ్ ఆర్డర్ అంశాలపై చర్చించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డు నిర్వహణ, రిసెప్షన్ విధులు, పెట్రోలింగ్, బ్లూకోట్స్ సిబ్బంది విధులు, డయల్ 100 స్పందనపై సిబ్బందితో మాట్లా డారు. సీఐ రాజు, ఎస్ఐ ఎన్.రవికుమార్ ఉన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): రామగిరి పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రామ్‌రెడ్డి సందర్శించారు. శాంతి భద్రత, నేరాల నియంత్రణ చర్యలు, ప్రజలతో పోలీసింగ్ పనితీరు, ప్రజా సేవల అమలు విధానాన్ని తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిందిగా సూచనలు చేశారు. ఎస్ఐలు శ్రీనివాస్, దివ్యలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): డీసీపీగా బాధ్యతలు చేపట్టిన భూక్య రాంరెడ్డి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. డీసీపీకి ఎస్ఐ కొట్టే ప్రసాద్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు.

అనంతరం డీసీపీ పోలీస్ సిబ్బందితో మాట్లాడి పలు రికార్డులను పరిశీలించారు. డయల్ 100, సైబర్ క్రైమ్, కమ్యూనిటీ పోలీసింగ్, రోడ్‌సేఫ్టీపై సూచనలు చేశారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన బూక్య రాంరెడ్డి బుధవారం గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి ఫిర్యాదుల స్వీకరణ, రైటర్లు పని తీరుపై వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులు, క్రైమ్ ఫైల్స్‌నే తనిఖీ చేశారు. డీసీపీ వెంట ఖని ఏసీపీ ఎం రమేష్, సీఐ ప్రసాదరావు ఉన్నారు.

విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావద్దు



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్లు

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు లోనవద్దని ట్రైనర్స్ సిహెచ్.సరోజ, ఎం.రాధాలక్ష్మి రంగనాథ్, ఇ.అనసూర్య సూచించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు జూనియర్ కళాశాలలో హెల్ప్ హార్ట్‌ఫుల్‌నెస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్టూడెంట్ కౌన్సెలర్ జె.రాజేశం ఆధ్వర్యంలో ట్రైనర్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెడిటేషన్, బలం బలహీనతలపై తరగతులు నిర్వహించారు. 16 వారాలపాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీఎల్ఎన్ రావు తెలిపారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతే ముఖ్యం

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో మానసిక ప్రశాంతతే అన్నింటికంటే ముఖ్యమైందని వన్నెస్ ట్రైనర్ మంథని అగ్రికల్చర్ ఏడీఏ అంజనీ అన్నారు. మంగళవారం జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ నేటి సమాజంలో యువత తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. జీవితంలో తీసుకునే నిర్ణయాల్లో ఏర్పడే గందరగోళంతోనే ఇలాంటి పరిస్థితి ఉంటుందన్నారు. ఎప్పుడైతే మానసిక ప్రశాంతత అలవాటు అవుతుందో అప్పుడు తాము తీసుకున్న నిర్ణయంపై అంచనా ఉంటుందన్నారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు ఇబ్బందులకు దారి తీస్తాయన్నారు. తల్లిదండ్రులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వారిని ఇబ్బందులకు గురి చేసే విధంగా ప్రవర్తించవద్దన్నారు. ప్రిన్సిపాల్ సయ్యద్ నలీం, స్టూడెంట్ కౌన్సిలర్ రెడ్డిలు పాల్గొన్నారు.

వల్లాభాయ్ పటేల్ జయంతి

ముత్తారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం సైనిక చర్యతో 500 సంస్థానాలను విలీనం చేసిన మహనీయుడు వల్లాభాయ్ పటేల్ అని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీఎల్ఎన్ రావు అన్నారు. ముత్తారం జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. వల్లాభాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ పీఓ జె.రాజేశం, డాక్టర్ ఎం.శివదాస్, ఎన్.పూర్ణచందర్, ఎం.వెంకట కృష్ణ రెడ్డి, ఎస్.లింగమూర్తి, కె.రుక్మ, ఎస్.జెరూష, సి.శ్రీనివాస్, పి.జయ, ఐ.బన్సీలాల్, డాక్టర్ జి.చంద్రమౌళి, ఆర్.సంపత్, రాజనర్సు, విద్యార్థినీ, విద్యార్థులున్నారు.

యూనివర్సిటీ పీజీ కాలేజీలో ఇండక్షన్ ప్రోగ్రాం

కోల్‌సిటీటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వం లక్షణాలు అలవర్చుకోవాలని, విలువలతో నడుచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఎన్టీపీసీ హెచ్ఆర్ విభాగ అధిపతి బిజయ్ కుమార్ సిగ్దర్ మాట్లాడారు. వ్యాపార ప్రపంచంలో మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్ విభాగాల్లో ఉన్నటు వంటి ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఎన్టీపీసీ అధికారులు రావత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్‌తో పాటు అధ్యాపక బృందం, ఎంబీఏ, ఎంసీఏ, బీకామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలకు గీజర్ అందజేత

మంథని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన గురుకుల కళాశాల విద్యార్థినులకు చలికాలం దృష్ట్యా రెస్క్యూ ఫౌండేషన్ ఇండియా ప్రాజెక్టు గీజర్‌ను మంగళవారం అందించింది. అమ్మ స్వచ్ఛంద సంస్థ సహకారంతో అందించారు. కళాశాలలో గీజర్ లేక ఇబ్బందులు పడుతున్నాయని విద్యార్థులు ఇటీవల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధి డాక్టర్ మాథ్యూ డేనియాల్ దృష్టికి తీసుకురావడంతో గీజర్‌ను మంజూరు చేసినట్లు అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్ తెలిపారు. కౌన్సెలింగ్ సైకాలజిస్టు అనంద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, లెక్చరర్స్ రజిత, విశ్వశాంతిలు పాల్గొన్నారు.

నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా యాదవ జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాలనీకి చెందిన తమ్మనవేన కుమార్ నియమితులయ్యారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేశం యాదవ్ నియామక పత్రాన్ని కుమార్‌కు అందజేశారు. కాగా కుమార్ యాదవ్‌ను పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత



డ్రగ్స్ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్

కోల్‌సిటీటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత అని రామగుండం ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలు అవతున్న ఘటనలు చూస్తున్నామని, వీరి ద్వారా నేర ప్రవృత్తి పెరుగుతున్నట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, సమాజంలో చెడ్డపేరు వస్తుందని ఎక్సైజ్ ఎస్సై పేర్కొన్నారు. మత్తు పదార్థాలు అమ్ముతున్న, సేవిస్తున్న వారి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



కాసులపల్లిలో రోడ్లపై గుంతలు పూడ్చుతున్న పోలీసులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు. మంగళవారం పెద్దపల్లి-ధర్మారం వెళ్లే రహదారిలో ఉన్న గుంతల కారణంగా అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు నివారించేందుకు రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో గుంతలను పూడ్చినట్లు రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్లరాదని, రాత్రి వేళల్లో మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, స్థానిక రైతులు , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో 800 మెగావాట్ల విద్యుత్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదంపై కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. తెలంగాణ చౌరస్తాలో బాణా సంచా కాల్చి స్వీట్లు పంచారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కృషి ఫలితంగా విద్యుత్ ప్లాంట్‌కు ఆమోదం లభించినట్టు నాయకులు పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, శంకర్‌నాయక్, జక్కుల దామోదర్‌రావు, శనిగరం తిరుపతి, రేశవేని కేశవులు, చక్రపాణి, మార్క రాజు, మోతుకు అవినాష్, రాజేశం, దశరథం, చాంద్‌పాష, ఫయాజ్, అఫ్సర్, పరకాల ప్రశాంత్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించాలి

కళ్యాణ్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వేడుకలను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ పులి మోహన్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తుందని, జిల్లాలో ఈనెల 26నుంచి అంబేద్కర్ వర్ధంతి డిసెంబర్ 6 వరకు రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు గొర్రె రమేష్, కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, కిష్టయ్య, అంకూస్, రామస్వామి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని కలెక్టర్‌పై చర్యలు తీసుకోండి

గోదావరిఖని, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పర్యటనపై ప్రొటోకాల్ పాటించని కలెక్టర్ కోయ శ్రీ హర్షపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీ మల్లికార్జున్ మంగళ వారం ఫిర్యాదు పత్రాన్ని సీఎస్‌కు పంపించాడు. ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎంపీ అయిన గడ్డం వంశీకృష్ణపై కలెక్టర్ చిన్న చూపు చూస్తూ అవమానపరుస్తున్నారని, ఇది సరైంది కాదని, గతంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై హెచ్చ రికలు చేసినా కలెక్టర్ పట్టించుకోవడం లేదన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్ స్థల పరిశీలనకు వస్తున్నానని ముందస్తు సమాచారం ఇచ్చినా ఏర్పాట్లు చేయ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇందిరమ్మ చీరల పంపిణీలో ఎంపీ పేరు పెట్టకుండా అవమానపరిచారని, దీనిపై విచారణ చేసి కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ



రాఘవపూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసిన డీపీవో వీరబుచ్చయ్య

పెద్దపల్లి రూరల్ , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించే కార్మికులతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. మంగళవారం రాఘవపూర్ గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు దుస్తులతో పాటు, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యదర్శి తూముల రవి నిర్వహించగా ముఖ్య అతిథిగా డీపీవో హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందిని డీపీవో సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామాలు శుభ్రంగా ఉంటాయన్నారు. బిల్ కలెక్టర్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే యాదవ ట్రస్ట్ లక్ష్యం



జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే యాదవ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ట్రస్ట్ సభ్యులతో కలిసి మాట్లాడారు. తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 28న పెద్దపల్లిలో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దాదాపు 18 కంపెనీలు మేళాలో పాల్గొంటాయని వివరించారు. శాంతినగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారని తెలిపారు. ట్రస్ట్ నాయకులు బత్తిని లక్ష్మణ్ యాదవ్, మల్లెత్తుల నాగరాజు యాదవ్, ఓదెలు యాదవ్, సభ్యులు పాల్గొన్నారు

పిల్లలతో మమేకమై బోధించాలి



మాట్లాడుతున్న జిల్లా అకాడమిక్ అధికారి పీఎం షేక్

సుల్తానాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు పిల్లలతో మమేకమై బోధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్ అన్నారు. మంగళవారం గర్రెపల్లి ఆదర్శ పాఠశాలలో ప్రీ ప్రైమరీ పాఠశాలల ఇన్‌స్ట్రక్టర్లకు ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆహ్లాదకర వాతావరణంలో కృత్యాధార బోధన అందించాలన్నారు. పూర్వప్రాథమిక విద్యలో పిల్లలతో ప్రేమపూర్వక పలకరింపుతో ఆనందకరమైన పరిస్థితుల్లో విద్యను అందించాలని, దీని వల్ల పిల్లలు చక్కగా నేర్చుకుంటారన్నారు. ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్ కౌర్ మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలు, కృత్యాల ఆధారంగా పలు అంశాలను నేర్పించాలన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్లు కిరణ్ కుమార్, రవి, ఈర్ల సమ్మయ్య, కృష్ణారెడ్డి, రమేష్, ఉపాధ్యాయుడు లచ్చయ్య పాల్గొన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు

సుల్తానాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గర్రెపల్లిలోని మోడల్ స్కూల్‌లో మహిళ అసిస్టెంట్ కుక్‌గా పని చేయడానికి ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ రాజయ్య తెలిపారు. మండలానికి చెందిన ఎస్సీ అభ్యర్థులు, 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 25 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఈ నెల 26 నుండి 30 తేదీ వరకు భూపతిపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో స్పెషలాఫీసర్ స్వప్నకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

సుల్తానాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే, కుంఫు పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 22న పెద్దపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే, కుంఫు చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థులు కటా విభాగంలో తరుణ్, మనోభిరామ్, బంగారు పతకాలు సాధించగా, కటా విభాగంలో రమేష్, సంచిత్, అభిరామ్ రజత పతకాలు సాధించారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. కరాటే మాస్టర్ కనకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



లాంగ్‌వాల్ పనులను సకాలంలో పూర్తి చేయాలి



ప్రాజెక్టు ప్లానింగ్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

రామగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లాంగ్‌వాల్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును సందర్శించారు. లాంగ్‌వాల్ పనులను నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయడానికి తీసుకుంటున్న చర్యలను ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు వివరించారు. లాంగ్‌వాల్ 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, 4వ ప్యానెల్ తయారీ పనులపై చర్చించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రీజనల్ సేఫ్టీ జీఎం మధుసూధన్, ఆర్అండ్‌డి జీఎం సిహెచ్ వెంకటరమణ, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు యాదయ్య, సత్యనారయణ, జనార్దన్, రఘురాం, పాల్గొన్నారు.

ఆర్జీ-3లో పర్యటించిన డైరెక్టర్



వ్యూపాయింట్ నుంచి పరిశీలిస్తున్న డైరెక్టర్

రామగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివి జన్ పరిధిలోని ఓసిపి1, 2 ప్రాజెక్టులను సింగరేణి డైరెక్టర్ (ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్) తిరుమలరావు మంగళవారం పర్యటించారు. ప్రాజెక్టు లోని వ్యూపాయింట్ ద్వారా ప్రాజెక్టును పరిశీలించారు. యంత్రాల సామ ర్థ్యాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జీఎం కార్యాల యంలో పలు అంశాల పై చర్చించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, అధికారులు శేఖర్‌బాబు, సత్యనారాయణ, రాజశేఖర్, ప్రవీణ్, పాంటింగ్, రామారావు, పాపయ్య పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను మార్చాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గానికి అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆర్‌జీ-1 ఏరియాలో పలు బొగ్గు గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్ పత్రాలను దహనం చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు గుండేటి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మెండె శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక హక్కులను కాలరాస్తుందని, కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా చేసి కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, కార్మికులు కార్మిక చట్టాలను కాపాడుకోవాలని, దాని కోసం కార్మిక సంఘాలు కార్మికవర్గాన్ని ఒకేతాటిపై నడిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాక పోతే దేశ, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చే ప డ ు తా వ ు ని హెచ్చరించారు. శేష గిరి, తిరుపతి, వెంకటయ్య, నర్సయ్య, దేవేందర్, రాజు, భాస్కర్, ప్రసాద్, ప్రవీణ్, ప్రదీప్, మధు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 29 చట్టా లను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌ను అమలుకు ఆదేశా లను జారీ చేయడాన్ని నిరసిస్తూ ట్రేడ్ యూని యన్ జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలను ధరించి నిరసన తెలిపారు. ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో ఓసిపి-1, 2, సిహెచ్‌పి, జీఎం కార్యాలయంలో అధికారు లకు వినతిపత్రం అందజేశారు. పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎంఆర్‌సి రెడ్డి, కొటరవీం దర్‌రెడ్డి, దొమ్మటి కొమురయ్య, నాగెల్లి సాంబయ్య, వేణుగోపాల్, గోపాల్, రవికుమార్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘా లు గనులపై నిరసనలు వ్యక్తం చేశాయి. కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఓసీపీ-3లోని వివిధ సెక్షన్‌లలో, వీకేపీ గని, ఏరియా వర్క్‌షాప్‌ల్లో బుధవారం ఆర్జీ-2 నల్లబ్యాడ్జీల తో నిరసనలు వ్యక్తం చేశారు. చట్టాల సవరణ ద్వారా కార్మికుల హక్కులు కోల్పోయే ప్రమాదం ఉన్నదని, యాజమాన్యా లకు అనుకూలంగా చట్టాలు ఉన్నట్టు తెలి పారు. లేబర్ కోడ్‌ల ప్రతు లను దహనం చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు ఎల్ ప్రకాష్, శంకర్‌నాయక్, అయిలి శ్రీనివాస్, అక్రం, ప్రభా కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లేష్, తోకల సమ్మయ్య, చంద్రయ్య, ఐ సత్యం, శ్రీనివాస్, నారాయణ, బొంత రాజు, మామిడి తిరుపతి పాల్గొన్నారు.

ఓసీపీ-1 ప్రాజెక్టులో లేబర్ కోడ్‌ల సవరించి, కోడ్‌ల కుదించడాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సైటాఫీస్ ఆవరణలో లేబర్ కోడ్‌ల ప్రతులను నాయకులు దహనం చేశారు. లేబర్ కోడ్‌ల సవరణ సరికాదని, వాటిని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గడ్డం తిరుపతి, నాగెల్లి సాంబయ్య, సంపత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సలీం, రామచందర్ రావు, తిరుపతిరావు, పాల్గొన్నారు.



ఓసీపీ-1లో లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేస్తున్న జేఏసీ నాయకులు

ఆర్‌జీ-1ను తనిఖీ చేసిన జీఎం(సెక్యూరిటీ) కార్పొరేట్

గోదావరిఖని, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కొత్తగూడెం జీఎం(సెక్యూరిటీ) సీహెచ్ లక్ష్మీనారాయణ మంగళవారం ఆర్‌జీ-1 ఎస్అండ్‌పీసీ విభాగాన్ని తనిఖీ చేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్‌జీ-1లో హై సెక్యూరిటి సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల చివరన పదవి విరమణ పొందుతున్న లక్ష్మీనారాయణను ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, డీజీఎం(సివిల్) వర ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారులు అఫ్రీన్ సుల్తాన్, సురేష్, లక్ష్మిరాజు, వేణు, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, సాంబశివరావు, వీరారెడ్డి, పాల్గొన్నారు.

పదవీ విరమణ చేయనున్న జీఎంకు సన్మానం

రామగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ జీఎం కార్యాలయంలో కార్పొరేట్ ఉపరితల గనుల జీఎం డివిఎస్. సూర్యనారాయణరాజు ఈ నెలలో పదవీ విరమణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్(ఈఅండ్‌ఎం) తిరుమలరావు, జీఎం సుధాకర్‌రావులు, అధికారులు జీఎంను సన్మానించారు. అధికారులు శేఖర్‌బాబు, బండి సత్యనారాయణ, రాజశేఖర్, ప్రవీణ్, కాశీ విశ్వేశ్వర్‌రావు, రాజేంద్రకుమార్, రాజారెడ్డి, సురేఖ, సుదర్శనం, ఐలయ్య, చంద్రశేఖర్, షబ్బీరుద్దీన్‌లు పాల్గొన్నారు.